ప్రజాశక్తి

మంగళవారం 14 జనవరి 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

● సంక్రాంతి సందడి..



ఒంగోలు నగరం, పేర్నమిట్ట వద్ద హిల్ సిటీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్ సందర్భంగా ఎద్దుల బండిపై యువతుల సందడి..

విద్యుత్ ఛార్జీల పెంపును
ఉపసంహరించుకోవాల్సిందే..

- సిపిఎం డిమాండ్
- భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి.. నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రక్రియను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నాడు ఒంగోలు, గాంధీనగర్‌లో భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం వద్ద విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపుదల లేదంటూనే అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు, సర్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారం మోపడం దారుణమైన అంశంగా పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి అదనపు వసూళ్ల ప్రక్రియకు తెర తీసే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ▶ 2లో



ఒంగోలు, గాంధీనగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం నాయకులు



బాపట్లలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం నాయకులు



కె. అగ్రహారంలో తెప్పోత్సవం

శ్రీవారి పుష్కరిణిలో వైభవంగా తెప్పోత్సవం

▶ 8లో

ఘనంగా సంక్రాంతి ఆటల పోటీలు

5లో ▶



ఉప్పుగుండూరులో పొట్టేళ్ల బలప్రదర్శన

5లో ▶

కోళ్లపందెం..రాజకీయం.?

- వెనక్కి తగ్గిన పోలీసులు
- పలుకుబడి చాటుకున్న అధికార పార్టీ నేతలు...
- బాపట్ల జిల్లాలోని పెద్ద బరుల్లో జోరుగా పందేలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో రేపల్లె, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పెద్ద బరుల్లో కోళ్లపందేలు జోరుగా సాగాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలో కోళ్ల పందేలు, ఇతర జూద క్రీడలు జరగకుండా చూడాలని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రయత్నించారు గానీ అధికారపార్టీ నేతల పలుకుబడి ముందు పోలీసులు వెనక్కి తగ్గారు. పోలీసు అధికారులు, సిబ్బంది అత్యధికంగా నేతల సిఫార్సులతోనే సదరు పోలీస్‌స్టేషన్లలో పోస్టింగులు వేయించుకున్న విషయం అందరికీ తెలిసిందే.. చిన్నచిన్న కోడి పందేలను అడ్డుకున్న పోలీసులు పెద్ద బరులు నిర్వహించే అధికారపార్టీ నేతలకు వ్యతిరేకంగా వ్యవహరించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పెద్ద బరుల్లో కోళ్ల పందేలను జూదరులు స్వేచ్ఛగా నిర్వహించారు. కొన్ని చోట్ల ఈ పందేలకు ప్రజాప్రతినిధులు కూడా ముఖ్యఅతిథులుగా పాల్గొనటం గమనార్హం.

జిల్లాలోని రేపల్లె నియోజకవర్గం, తూర్పు పాలెంలో దాదాపు 35 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అతి పెద్ద బరుల్లో భారీ ఎత్తున కోళ్లపందేలు జరుగుతున్నాయి. ఇక్కడి విఐపి బరిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తన మిత్ర బృందంతో పాల్గొన్నారు. బాపట్ల నియోజకవర్గం మంతెనవారిపాలెం వద్ద దాదాపు 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పెద్ద బరిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో స్థానిక ▶ 2లో



వేమూరు, క్రాప అడ్డరోడ్డు వద్ద కోడిపందేలు



బరుల వద్ద ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం, ఫ్లెక్సీలు

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి ధరలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 'బాదుడే బాదుడు' కార్యక్రమాన్ని నిర్వహించిన వైనాన్ని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచేది లేదని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని నమ్మబలికి ఆరు నెలలు తిరక్కుండానే అదే బాటలో పెంచడం ప్రజల్ని మోసగించడమే అన్నారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే కాలంలో గహాలకు స్మార్ట్ మీటర్లను బిగించి మీటర్లకయ్యే ఖర్చు రూ.15 వేలు వరకు వాయిదాలలో వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రజలెవ్వరూ స్మార్ట్ మీటర్లను బిగించుకోవద్దని సూచించారు. తొలుత గాంధీనగర్ వాసులతో కలసి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, నగర నాయకులు తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, కె.శ్రీనివాసరావు, బివి రావు, దామా శ్రీనివాసులు, జి శ్రీనివాసులు, షేక్ పీరు, కె విశ్వసేన్, రామకష్ణ, రిటైర్డ్ ఆర్ డిఓ శ్రీధర్ రావు, టివిఆర్ సుబ్బారావు, పోలయ్య, కస్తూరి,పోకల కోటేశ్వరరావు, సురేష్, దాసు, రావూరి శ్రీనివాసరావు గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు.

బాపట్లలో..

బాపట్ల: పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయం వద్ద వేసిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన టిడిపి నేతలు ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ హామీని గాలికి వదిలేశారని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, పార్టీ నాయకులు కె. కోటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు సుభాషిని, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కోళ్ల పందెం..'రాజీ'కీయం.?

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాప్రతినిధి పాల్గొన్నారు. ఇక్కడ ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కోళ్ల పందేలు నిర్వహించారు. సోమవారం జరిగిన 9 పోటీల్లో ఐదు సార్లు విజేతగా నిలిచిన పందెంకోళ్ల జట్టుకు బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. వేమూరు నియోజకవర్గంలో క్రాప అడ్డరోడ్డు వద్ద, అనంతవరంలో కోళ్లపందేలు నిర్వహించారు. జిల్లాలో పెద్ద బరుల్లో జరిగిన అన్ని కోళ్లపందేల్లో విజేతలకు బైక్‌లను బహుమతిగా ఇస్తున్నారు.

పెద్ద బరులు వదిలేసి..

ఆదివారం మాదిరిగానే సోమవారం కూడా జిల్లా లోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న కోళ్లపందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. అధికారపార్టీ నేతల అండతో జరుగుతున్న పెద్ద బరుల జోలికి వెళ్లలేదు.

పలు చోట్ల జూదరుల అరెస్టు

- నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో గాలివారిపాలెం పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామ శివారులలో జరుగుతున్న కోడిపందేల స్థావరాలపై దాడులు చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రెండు పందెం కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.1300 నగదు సీజ్ చేశారు.
- చందోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంతెనవారి పాలెం, కొత్తపాలెం, పిట్లవానిపాలెం గ్రామాల్లో దాడులు చేసి.. ఏడుగురురిని, 5 పందెంకోళ్లను అదుపులోకి తీసుకున్నారు.
- అడవులదీవి, చెరుకుపల్లి, చుండూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాడులు చేసి 16 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పది కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సంక్రాంతి క్రీడలు ఐక్యతకు బాటలు

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి



ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంక్రాంతి సందర్భంగా వాడవాడల్లో జరుగుతున్న ఆటల పోటీలు సాంస్కతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతకు సామరస్యతకు మరింత దారి చూపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంతనూతలపాడు మండల కేంద్రంలో సోమవారం ఆటల పోటీలను నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలను రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు చేతికొచ్చే సమయంలో వచ్చే సంక్రాంతి పండుగను ప్రజలందరూ కులమతాలకు అతీతంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ప్రజల మధ్య పాలకులు చిచ్చు పెట్టాలని ప్రయత్నం చేసినా, ఇటువంటి పండుగలు ప్రజల్ని ఐక్యత, సామరస్యం వైపు నిలబెడతాయని ఆమె అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతనూతలపాడులో గత 30 సంవత్సరాలుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి అధ్యక్షత వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్‌కె నాగూర్‌బి, జెవివి నాయకులు కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు పి శ్రీమన్నారాయణ, కే శ్యామ్, ఎం సుబ్రహ్మణ్యం, కే బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన మద్దిపాడులోని బీసీ కాలనీలో సోమవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పండుగ సందర్భాలలో ఇంటిల్లిపాది బంధుమిత్రుల తో ఆనందంగా ఉంటారని, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మహిళలకు, చిన్నారులకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్ తదితర ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భవాని, రిటైర్డ్ టీచర్ కటకం వెంకటేశ్వర్లు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సంతనూతలపాడు: స్థానిక హైస్కూల్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం సాయంత్రం ప్రారంభమైన మండల స్థాయి డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 30 టీములు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్స్‌ను అధ్యక్షులు బొడ్డు వెంకటరావు, ఆర్గనైజర్స్ కే రజినీకాంత్, బొద్దులూరి యల్లమందరావు, ఏ అశోక్‌రాజు, ఎం రామాంజనేయులు, నారాయణరెడ్డి పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో పిండి వంటలు పంపిణీ



వృద్ధులకు పిండి వంటలు అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మారెళ్ల వెంకటేశ్వర్లు, కాశీరత్తమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు బలరాం కాలనీలోని ఉషోదయ వృద్ధుల ఆశ్రమం లోని వృద్ధులకు అరిసెలు, పిండి వంటలను బిసి సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు దన్నారపు మస్తాన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆధారం లేని వృద్ధులకు సంక్రాంతి పండగ ఆనందంగా జరుపుకోవాలని, పేదవారికి అవసరాలు తీర్చే దిశగా వారి ట్రస్టు పనిచేస్తుందని అన్నారు. ట్రస్టు నిర్వాహకులు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి నాడు వృద్ధులకు పిండి వంటలు అందించి మానవత్వం చాటుతున్నామన్నారు. సేవా కార్యక్రమంలో మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఒంగోలు మురళీకృష్ణ, హైదరాబాద్ కోటి, అవిషా, హరీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మరో ఇద్దరికి గాయాలు


మృతి చెందిన మనోహర్ జోష్


మనోహర్ జోష్(ఫైల్)

ప్రజాశక్తి-చీరాల

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వేటపాలెం మండలం జాతీయ రహదారిలోని కటారిపాలెం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల మేరకు.. చిన్నగంజాం మండలం మోటుపల్లి గ్రామంలో నివాసముంటున్న అబ్రహం కుమారుడు పి.మనోహర్ జోష్ (16) పదో తరగతి చదువుతున్నాడు. గోపయ్య అనే స్నేహితునితో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా వేటపాలెం జాతీయ రహదారిలో కటారిపాలెం వద్ద ఎదు రుగా వస్తున్న మరో యువకుడి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మనోహర్ జోష్‌కు తీవ్ర గాయా లయ్యి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే స్పందించి చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్య చికిత్సను అందించిన వైద్యులు మనోహర్ జోష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. గోపయ్యకు కూడా రోడ్డు తీవ్ర గాయాలు కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు సమాచారం. ఈ ఘటనలో మరో ద్విచక్ర వాహనదారుడు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. జరిగిన ప్రమాదంపై అవుట్ పోస్ట్ పోలీసుల సమా చారంతో వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పండగ సమయంలో సరదాగా స్నేహితులతో అప్పటివరకు ఆనందంగా గడిపిన తమ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుం బంలో విషాదం నెలకొంది.

కారు ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బాపట్ల మం డలం నాగేంద్రపురం సమీపంలో జాతీయ రహదారిపై సోమ వారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం నాగేంద్రపురం గ్రామానికి చెందిన కావూరి సు బ్బారెడ్డి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వెంట నడు చుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో కావూరి సుబ్బారెడ్డి అక్కడక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: యువకుడికి గాయాలు


గాయపడిన సురేష్

నాగులుప్పలపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘ టన సోమవారం ఉప్పుగుండూరులో 216 జాతీయ రహ దారిపై మాచవరం రోడ్డు వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఓమ్మెవరం గ్రామానికి చెందిన నార్నె సురేష్ చవటపాలెంలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పుగుండూరుకు ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వెళ్ళుచుండగా బైపాస్ రోడ్డులోని మాచవరం రోడ్డు దాటే క్రమంలో ఒంగోలు నుంచి చీరాల వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై కొద్దిదూరం దూసుకుపోవడంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తర లించారు. 216 జాతీయరహదారిపై ఉప్పుగుండూరులోని మాచవరం రోడ్డు వద్ద అండర్ పాస్ నిర్మించకుండా రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో తరుచూ ప్రమాదాలకు నిలయంగా మారి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగాయి. కనీసం సిగ్నల్ బోర్డులు కూడా లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన తల్లి మృతి


లక్ష్మీరాజ్యం (ఫైల్)

ప్రజాశక్తి-పర్చూరు

ఇటీవల పర్చూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అక్కాచెల్లెళ్లు సజీవ దహనమైన సంఘటనలో గాయపడిన తల్లి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో మరో విషాదం చోటుచేసుకుంది. కన్న కూతుళ్లను కాపాడుకునే ప్రయత్నంలో తీవ్రంగా కాలిపోయి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో దాసరి లక్ష్మీరాజ్యం (64) చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో సోమవారం తనువు చాలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం నిర్వహించారు. మండలంలోని చిన్న పీఆర్సీ తండా అటవీ ప్రాంతంలో 400 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా అమ్మినా, తయారుచేసినా నేరమని, కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ విజ్ఞేశ్వర కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.16,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కోడి పందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


శివరామకృష్ణకు కేక్ తినిపిస్తున్న మంత్రి సత్యప్రసాద్

శివరామకృష్ణకు మంత్రి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-రేపల్లె

నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వీరవల్లి శివరామకృష్ణ జన్మ దినోత్సవ వేడుకలు సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో రేపల్లెలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో 10 కేజీల కేక్‌ను శివరామకృష్ణ కట్ చేసి అందరికీ పంచారు. శివరామకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శివరామకృష్ణ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, రాజకీయంగా మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నల్లూరిపాలెం గ్రామంలో శివరామకృష్ణ అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుఖవాసి సతీష్ కిరణ్, రమేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమైక్యంగా పోరాడాలి

మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షుడు ఏసుదాసు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాదిగ ఉద్యోగుల సమైక సంఘం నేతలు

ప్రజాశక్తి - చీరాల

మాదిగ ఉద్యోగులందరూ సమైక్యంగా పోరాడాలని మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షుడు ఏసుదాసు అన్నారు. చీరాల అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. సమైక్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక చీరాల అంబేద్కర్ భవనంలో మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు బొంత ఏసుదాసు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ఎంఈఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు వంగెవరపు రమేష్ మాదిగ అధ్యక్షత వహించారు. ముందుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ ఉద్యోగులు మరింత సంఘటితం కావాలన్నారు. చీరాల ప్రాంతంలోని మాదిగ ఉద్యోగులు మాదిగ ఉద్యోగుల సమైక్యాలో సభ్యులుగా చేరాలని మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి ఉద్యోగులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. మాదిగల చిరకాల లక్ష్యమైన ఎస్సీ వర్గీకరణ సాధించుటకు అన్ని విధాలుగా అండదండలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి బాపట్ల జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, ప్రకాశం జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షులు కత్తి ఐజక్ మాదిగ, బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దొడ్డ వందనం మాదిగ, ఎంఈఎఫ్ అధ్యక్షులు వంగవరపు రమేష్, చీరాల నియోజకవర్గ ఎంఈఎఫ్ అధ్యక్షులు తేల రమేష్ మాదిగ, గౌరవ అధ్యక్షులు బండి బిక్షాలు, నాయకులు పిడతల అభిషేక్, దుడ్డు సైమన్, తేళ్ల రాంబాబు, తేళ్ల వీరశేఖర్, రెబ్బవరపు అశోక్, ముంగర రాజా, రావినూతల నాగేశ్వరరావు, తెళ్ళ అశోక్, తెళ్ల రాంబాబు, స్టాలిన్, మాధవ్, రాజేష్, కిషోర్, కొండయ్య, ముంగర పోలయ్య, దుడ్డు జార్జి, సాల్మన్, డొక్కా మాల్యాద్రి, జడ మోషే, ముంగర అనిల్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత


విద్యార్థికి నగదు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-పంగులూరు

కొరిసపాడు మండలంలోని రావినూతల గ్రామంలో ఇటీవల నిర్వహించిన ఎలగాల సుబ్బారావు స్మారక ప్రతిభ పరీక్షలో చందలూరు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొత్తం 400 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనగా చందలూరు హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు బహుమతి సాధించి, ఆల్‌రౌండ్ ఛాంపియన్లుగా నిలిచారు. వీరికి సోమవారం రావినూతల హైస్కూల్లో బహుమతులను అందజేశారు. పదో తరగతి లెక్కలు, సైన్సు సబ్జెక్టుల్లో నిర్వహించిన ఈ పరీక్షలో చందలూరు పాఠశాలకు చెందిన కట్టా హారిక 82 మార్కులు సాధించి రూ.10 వేలు బహుమతి పొందింది. విప్పర్ల కల్పన కూడా పదివేల రూపాయలు బహుమతి పొందింది. జిర్రా మణిదీప్ రెడ్డి, చల్లా గాయత్రి, పతకమూరి తేజచారిలకు కన్సోలేషన్ బహుమతుల క్రింద రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. వీరిలో పతకమూరి తేజచారికి డాక్టర్ గోపీచంద్, ఆయన మిత్రులు, మామిడిపాడు స్కూల్ అసిస్టెంట్ పూనాటి హరిబాబు, నూజిలపల్లి ఎంపీయుపి స్కూల్ టీచర్ శ్రీనివాసరావులు మరో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హాకీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-బాపట్ల

సత్య సాయి జిల్లా మదనపల్లి బీటీ కళాశాలలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ మెన్ అంతర జిల్లాల హాకీ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ కార్యదర్శి బోయిన వీరచంద్ర సోమవారం తెలిపారు. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ హాకీ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.



భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

జిల్లా ప్రజలకు మంత్రుల సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో మెలగాలని, పాడిపంటలు, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని కోరారు. సంక్రాంతి పండుగ సంబరాలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మాజీమంత్రి సురేష్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కొండపి



ప్రజలకు మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండుగవేళ, భోగభాగ్యాలతో అష్టశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో పసిడి పంటలతో ప్రతి ఇంట మంచి జరగాలని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు.

భోగి వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

సంక్రాంతికి ముందు రోజు జరుపుకునే భోగి భోగభాగ్యాలతో పాటు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని రథం బజార్లో భావనారాయణ స్వామి దేవస్థానం గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం బావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం ఆరు మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఎన్ఆర్‌కే యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. మిట్టపాలెం, చోడవరం మధ్య జరిగిన మ్యాచ్‌లో మిట్టపాలెం గెలుపొందింది. టంగుటూరుకు- దాసిరెడ్డిపాలెం జట్ల మ్యాచ్‌లో టంగుటూరు టీం గెలుపొందగా, నర్సింగోలు-కట్టుబడిపాలెం జట్ల మధ్య మ్యాచ్‌లో నర్సింగోలు టీం గెలుపొందిందని తెలిపారు. ముప్పవరం-కారుమంచి టీంలకు మ్యాచ్ జరగగా ముప్పవరంటీం గెలుపొందిందని, తాటాకులపాలెం- పేరాపురం లెవెన్సు మ్యాచ్‌లో తాటాకులపాలెం టీం, అనకర్లపూడి-భీమిపాడు మ్యాచ్‌లో అనకర్లపూడి టీం గెలుపొందిందని కమిటీ సభ్యులు తెలిపారు.

భోగి మంటల్లో కరెంటు బిల్లులు

ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

ప్రజాశక్తి-అద్దంకి

ప్రజలపై ప్రభుత్వం కరెంటు భారాలను వేయడానికి నిరసిస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భోగిమంటల్లో కరెంట్ బిల్లులు దహనం చేశారు. అద్దంకిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, నాయకులు డి.గంగాధర్, బి.విజయ్ కుమార్, రావులపల్లి కోటేశ్వరావు, మున్సిపల్ వర్కర్స్ సీనియర్ నాయకులు పి.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపివేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. కొలలపూడిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.రామకోటేశ్వరరావు, కె.వాసు, పి.వెంకట్రావు, ఎన్.నరసింహారావు, కె.ప్రసాద్, కె.వెంకటరత్నం, సుకన్య, రాజ్యం, రాములమ్మ పాల్గొన్నారు.

రేపల్లె: కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలేసి మోసం చేసిందని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ విమర్శించారు. విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని



మార్టూరులో కరెంటు బిల్లులు దహనం చేస్తున్న నేతలు



రేపల్లెలో కరెంటు బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నేతలు

కోరుతూ సోమవారం పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో భారం మోపారని విమర్శించారు. గత ప్రభుత్వం కానీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం కానీ ఆదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకునే ధైర్యం లేదన్నారు. మోడీకి లొంగిపోయి ఆదాని చెప్పు చేతల్లో రాష్ట్రప్రభుత్వం ఉందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల వల్ల ప్రజలపై విద్యుత్ ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారాలు మోపుతున్నారని, మరో పక్కన స్మార్ట్ మీటర్లు పెడుతూ ప్రీ పెయిడ్



చీరాలలో భోగి మంటల్లో బిల్లులు కాల్చేస్తున్న నేతలు



అద్దంకిలో బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

విద్యుత్ పేరుతో ప్రజల దగ్గర మరింత ఎక్కువగా విద్యుత్ చార్జీలు వసూలు చేయటం కోసం కూటమి ప్రభుత్వం పూనుకుందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, వై.నవీన్ పాల్గొన్నారు.

చీరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం గాంధీ నగర్‌లో సిపిఎం కార్యకర్తలు విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో తగలబెట్టి నిరసన తెలియజేశారు. ఈ సంధ్భంగా సిపిఎం చీరాల ఏరియా కార్యదర్శి ఎన్. బాబురావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు ఒప్పందన్ని రద్దు చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.15 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. ఈ భారాలకి వ్యతిరేకంగా ప్రజలు ప్రతిఘటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్.వసంతరావు అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కొండయ్య, పి.ప్రభావతి, స్థానిక నాయకులు బి.శ్రీను, బి.సుబ్బారావు, ఎన్.శ్రీను, వేంకటేశ్వర్లు, శేషయ్య, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు సౌత్‌జోన్ సిసి, ఎస్‌కెఎం సిసి జట్లు

ప్రజాశక్తి-మేదరమెట్ల

సౌత్ జోన్ సిసి 11 జట్టు, ఎస్‌కేయంసిసి చెన్నై జట్టు సెమీస్‌కు చేరాయి. సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలలో భాగంగా రావినూతల ఆర్ఎస్‌సిఏ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లో హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం సౌత్ జోన్ సిసి, ఇండియన్ బ్యాంక్ ఎస్ఎన్ఆర్ సిసి జట్ల మధ్య మ్యాచ్‌లో సౌత్‌జోన్ సిసి జట్టు గెలుపొందింది. టాస్ గెలిచిన సౌత్ జోన్ బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లులో 163 పరుగులు చేసింది. అనంతరం 164 విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియన్ బ్యాంక్ ఎస్ఎన్ఆర్ సిసి 19.3 ఓవర్లలో 146 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది.

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఎస్‌కేయం సిసి చెన్నై, జీఎస్టీ సీఈ చెన్నై జట్లు తెలపడగా ఎస్కేయం జట్టు గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్కేఎం జట్టు 19.4 ఓవర్లలో 175 పరుగులు చేసింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జిఎస్టి చెన్నై జట్టు కేవలం 11.5 ఓవర్లలో 63 పరుగులను మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఈ రోజు గెలిచిన సౌత్ జోన్ సిసి, ఎస్కేయం సిసిలు మంగళవారం జరగబోయే సెమీస్ పోరుకు సిద్ధమయ్యాయి.

నేటి మ్యాచ్‌లు: టోర్నమెంటులో భాగంగా నేడు జిసిడిఎ గుంటూరు వర్సెస్ సౌత్ జోన్ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. మధ్యాహ్నం ఎంఆర్‌సి చెన్నై వర్సెస్ ఎస్‌కేయం సిసి చెన్నై జట్ల మధ్య జరగనున్నట్లు ఆర్ఎస్‌సిఏ అధ్యక్షులు కారుసాల నాగేశ్వర రావు, మోపర్తి శేషారావు, అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



హోరాహోరీగా తలపడుతున్న జట్లు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-పంగులూరు: పంగులూరు మండలంలోని ముప్పవరం పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి ఉన్నత పాఠశాలలో 1983-85 బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం సందడిగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. తమ ముందు ఆడుతూ పాడుతూ కనిపించిన పిల్లలు, వారి కుటుంబాలతో కలిసి ఈ కార్యక్రమానికి రావడం చూసి ఉపాధ్యాయులు అమితానందం చెందారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారుతీ, రాజేంద్ర, వెంకా రెడ్డి, శారద, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్, ఉపాధ్యా యులు జానకిరామయ్య పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు.. ఐక్యతకు బాటలు

ప్రజాశక్తి-బాపట్ల

మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు వంటివి గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతకు బాటలు వేస్తాయని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. సోమవారం సంక్రాంతి సందర్భంగా బాపట్ల మండలం కుక్కలవారిపాలెం గ్రామానికి చెందిన కామ్రేడ్ గంపాల వెంకటేశ్వర్లు, గంపాల కోటిరెడ్డి మెమోరియల్ ముగ్గుల పోటీలు, మహిళలకు సంక్రాంతి ఆటల పోటీలను సిఐటియు, అంగన్వాడీ, ఆశా వర్కర్ల యూనియన్, కుక్కలవారిపాలెం గ్రామ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు, యువతులు ఒకచోటకు చేరి ముగ్గుల పోటీలు వంటివి ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించగలిగితే వారిలో మరింతగా ఐక్యత భావం పెరుగుతుందన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి పర్వదినాల్లో ముగ్గుల పోటీలు, సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకోవడం రేపటి తరానికి వాటి ప్రాధాన్యత తెలియజేసిన వారమవుతామన్నారు. సిపిఎంకు ఒకప్పటి పురిటి గడ్డయిన కుక్కలవారిపాలెం గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, శరత్, భోగిరెడ్డి, లక్ష్మణ, ఎం.కొండయ్య, సుభాషిని, కోట వెంకటేశ్వర రెడ్డి, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.



ముగ్గుల వేస్తున్న మహిళలు



క్రికెట్ ఆడుతూ.. పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

క్రీడలు స్నేహ పూర్వకమైన వాతావరణంలో ఆడాలే తప్ప పగలు, ప్రతీకారాలు చూపకూడదని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర గిరిజన గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయిలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ఓటు బ్యాంకుగానే కాకుండా అవసరమైన సమయాల్లో వారి నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రోత్సహించాలని తెలిపారు. ఈ క్రమంలోనే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో 70 టీములు పాల్గొనడం శుభ పరిణామమన్నారు. అనంతరం క్రికెట్ ఆడి యువతను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, గుమ్మా పద్మజ యల్లేష్, బెజవాడ పెద్ద గురవయ్య, సర్పంచ్‌లు ఏకుల జయమ్మ ముసలారెడ్డి, రామావత్ అరుణాబాయి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఫిలిప్, రమేష్, సత్తిరెడ్డి, వెంకటరెడ్డి, నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాటిపర్తి ఇంటి వద్ద భోగి

– యర్రగొండపాలెం పట్టణంలోని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఇంటి వద్ద సోమవారం భోగి మంటలు వేశారు. ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మంద జగన్నాథంకు నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తెలంగాణ మాజీ ఎంపీ మంద జగన్నాథం మతికి ఎంఈఎఫ్ అసోసియేషన్ నివాళులర్పించింది. సోమవారం నాడు ఒంగోలులో ఆ సంఘ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షులు బొంతా ఏసుదాసు, జిల్లా అధ్యక్షులు కత్తి ఇజక్ పాల్గొన్నారు.

పాత నేరస్తులపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ఎస్ఐ చౌడయ్య

మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించిన పాత నేరస్తులపై కూడా గట్టి నిఘా పెట్టినట్లు యర్రగొండ పాలెం ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ పాటికే చెన్నరాయునిపల్లిలో ముగ్గురిపై బెండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం నిర్వహించినా, అక్రమ మద్యం కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దల సహాయ సహకారంతో ఉత్సవాలు నిర్వహించి వారికి తగిన బహుమతులు అందజేయడంలో గ్రామ పెద్దలు ముందుంటారు. దానిలో భాగంగా భోగి పండుగ సంధర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గొబ్బెమ్మలు, భోగి పండుగ శోభ ఉట్టిపడేలా పుల్లలచెరువులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి వెండి గిన్నె, రెండో బహుమతి రూ.2016లు, కమ్మవారిపల్లెలో మొదటి బహుమతి రూ. 4500, రెండవ బహుమతి రూ.3500, మూడో బహుమతి రూ. 2016లు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

ప్రజలకు భారంగా మారే స్మార్ట్ మీటర్లను రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని గోపాలపురం గ్రామంలో విద్యుత్ బిల్లులను భోగిమంటలలో నిరసన తెలిపారు. పట్టణంలోని డివి పాలెం చెన్నకేశనగర్, బస్టాండ్ సెంటర్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, ఏ ఖాదర్ భాషా, బత్తుల నాగేశ్వర రావు, కే శంకర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, సయ్యద్ గౌస్ బాషా, షేక్ ఖాసిం సాహెబ్, ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఒంగోలులో బిల్లులు దహనం

ఒంగోలు సిటీ: పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా సిపిఎం పిలుపులో భాగంగా ఒంగోలు నగరంలో 48, 49 డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలో, దిబ్బల రోడ్డులో



పామూరులో నిరసన కార్యక్రమంలో సిపిఎం నేతలు



ఒంగోలులో నిరసన కార్యక్రమంలో సిపిఎం నేతలు

విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. జి.రమేష్ అధ్యక్షత ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంకణాల రమాదేవి పాల్గొన్నారు.

నగరంలో పలుచోట్ల..

నగరంలో 20 చోట్ల విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో దగ్ధం చేశారు. సత్యనారాయణపురం ఎన్జీవో కాలనీలో జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు నాయకత్వంలో, వీఐపీ రోడ్డు, సుజాతనగర్ ప్రాంతంలో దామ శ్రీనివాసులు ఆధ్వర్యంలో, ఎల్బీజీ భవన్ వద్ద ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ నేతత్వంలో, మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు నాయకత్వంలో, కొప్పోలులో సింగమనేని హనుమంతరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సిఐటియు కార్యాలయం వద్ద...

సిఐటియు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి పి.కల్పన, కె.విశ్వసేన్ నాయకత్వం వహించారు.

ప్రతి సంక్రాంతికీ పేదలకు సాయం

'సూర్యశ్రీ' ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేదలు కూడా సంక్రాంతి పండుగ చేసుకోవాలని, వారి కళ్ళల్లో ఆనందం చూడాలనే తలంపుతో పేదలకు పిండి వంటలు చేసుకొనేందుకు అవసరమైన సరుకులను ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా అందిస్తున్నామని సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు, కర్నూల్‌రోడ్డులోని ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు నిర్వాహకులు సర్దార్ బాషా షహనాజ్ దంపతుల ఆధ్వర్యంలో మండవ మురళీకష్ణ 120 మంది పేదలకు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ మాట్లాడుతూ సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు తాము ట్రస్టు ద్వారా పేదలకు సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు మారెళ్ల



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న మండవ మురళీకృష్ణ

సుబ్బారావు, బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు ధర్నాలకు మస్తాన్రావు, దోస్తీ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ మహబూబ్, ట్రస్ట్ గౌరవ సభ్యులు మండల సుబ్బారావు, జెసిఐ అధ్యక్షులు మేడి శెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న బసివిరెడ్డి

బసివిరెడ్డికి ఉత్తమ రైతు అవార్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జాతీయ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో రూ.కోటి వ్యయంతో గొర్రెల యూనిట్‌ను యర్రగొండపాలెంనకు చెందిన నారు బడివిరెడ్డికి చాలా సమర్ధవంతంగా నిర్వహించారు. ఇందుకు గానూ సోమవారం పూణెలో యర్రగొండపాలెంనకు చెందిన నారు బడివిరెడ్డికి రాష్ట్రంలోనే గొర్రెల యూనిట్‌ను ఎలాంటి ఒడిదుడులు లేకుండా నిర్వహించినందుకు గానూ ప్రథమ రైతుగా గుర్తించి కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ అలియాస్ లాలం సింగ్ చేతులు మీదుగా మెమెంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలామాస్ లాలం సింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి 50 లక్షల సబ్సిడీతో రూ.కోటి వ్యయంతో గొర్రెల యూనిట్‌ను నారు బసివిరెడ్డి చక్కగా నిర్వహించారన్నారు. 500 గొర్రెలతో పాటు 20 పొటేళ్లను పెంచి మంచి లాభాలను గడిస్తున్నట్లు తెలిపారు. బసివిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో ఇచ్చే వివిధ రకాల యూనిట్లను పొంది లబ్ధిపొందాలని సూచించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రాచారి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఉన్న అధికారాలను పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి తెలిపారు. సోమవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయంతో స్థానిక సంస్థలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను కాపాడడంతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రజలకు కూడా సౌకర్యం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వం దష్టికి ఈ సమస్యను పలు మార్లు తీసుకు వచ్చినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి.రాము యాదవ్, మన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ఆటల పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సంక్రాంతి సందర్భంగా డైఫి, ఐద్వా, ఒంగోలు నగర అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని వడ్డెపాలెంలో ఆటలు పోటీలను ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అంతరించిపోతున్న సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, గిరిలో కుండకొట్టుట, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, సిఐటియు నాయకులు పసుపులేటి నరసింహారావు, అవిషా, హరీష్, దండు అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, కోసూరి శ్రీదేవి పాల్గొన్నారు.

కొప్పోలులో..

ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలులో డివైఎఫ్ఐ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలపోటీలు నిర్వహించారు. సోమవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు సూది దారం, స్పూన్ అండ్ మార్బుల్, మ్యూజికల్ చైర్, కుండలో బంతి, స్లో సైక్లింగ్, పాటలు, డ్యాన్స్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు బొడపాటి రాఘవరావు, శింగంనేని హనుమంతరావు, ఘట్టమనేని శ్రీనివాసరావు, సాదినేని రామారావు, ఘట్టమనేని చంద్రయ్య, గంగాడి లింగయ్య, ఆవులమంద వెంకటయ్య , సిఐటియు నాయకులు, వట్టిగుంట అంజిరెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు..

శివప్రసాద్ కాలనీలో..

ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గాంధీ నగర్, శివప్రసాద్ కాలనీలో సంక్రాతి ఆటలపోటీలు నిర్వహించారు. సోమవారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ ఐ, ఐద్వా, సిఐటియు నగర కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. రాహుల్ సోషల్ వర్క్ ఫౌండేషన్ కె.రాఘవరావు, ఆర్వి.ప్రసాద్, చిట్టెం రాము సహకారంతో జరిగిన కార్యక్రమంలో సయ్యద్ హుస్సేన్, షేక్ పీరు, బి.వి.రావు పాల్గొన్నారు.



డాక్టర్ మునగ నరసింహారావును కలిసిన శివప్రసాద్‌రెడ్డి

నరసింహారావును కలిసిన బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక గడియారం స్థంభం సెంటర్‌లోని నాగసుబ్బయ్య మెడికల్ అధినేత, మాజీ సర్పంచ్ మునగ కోటిరత్నం నరసింహారావును శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ మునగ నరసింహారావు కుమారుడు అంజి, మారుతీ ఎమ్మెల్యే బూచేపల్లిని సాలువతో సన్మానించారు. జంబో జిరాక్స్ అధినేత సిద్ధి కోటిరెడ్డి రాయల్ బుల్లెట్ నూతన మోటార్ సైకిల్‌ను ప్రారంభించారు. అనంతరం పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు జి పీటర్ మృతి చెందగా ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.



బైక్ అందజేస్తున్న ఎంఎల్ఎ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

బహుమతిగా బైక్ అందజేత

ప్రజాశక్తి-దర్శి

స్థానిక గడియారం స్థంభం సెంటర్ వద్ద గల రాజా మొబైల్స్‌లో స్క్యాచ్ కార్డు ద్వారా హెూండా మోటార్ సైకిల్‌ను గెలుచుకున్న మండలంలోని ఎర్ర ఓబనపల్లి చెందిన యల్లయ్యకు శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా రాజా మొబైల్స్ అధినేత చెమిరెడ్డి రాజారెడ్డి అందించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్న వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, పివి రెడ్డి, కర్ణ భాస్కర్‌రెడ్డి, కెవి రెడ్డి, సద్ది పుల్లారెడ్డి, దేవదానం, మోహన్‌బాబు పాల్గొన్నారు.



బహుమతులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచి సూరారెడ్డి,

విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని బొద్దికూరపాడు రామాలయం సెంటర్‌లో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పోలంరెడ్డి చిన్నవీరారెడ్డి ధర్మపత్ని లక్ష్మీ నరసమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనుమరాళ్లు భోగి పండుగను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్లో బైక్ రేస్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన యర్రబెల్లి ధనుష్‌రెడ్డికి రూ.5116, ద్వితీయ స్థానం సాధించిన కావూరి విజయబాబుకు రూ.3116, తృతీయ స్థానం సాధించిన ధరణికోట హరికృష్ణకు రూ.1116 నగదు అందజేశారు. కార్యక్రమంలో పోలంరెడ్డి సూరారెడ్డి, రమణారెడ్డి, వీరనాగిరెడ్డి, కోటిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రిటైర్డ్ సోషల్ మాస్టర్ సన్నపురెడ్డి అంజిరెడ్డి, పోలంరెడ్డి సుబ్బారెడ్డి, సంగన యోగిరెడ్డి, హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్ వైవి రామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు: సైదా

ప్రజాశక్తి - పొదిలి

ప్రజలందరూ సంక్రాంతి, కనుమ పండుగలను ఇంటిల్లపాది, బంధువులు స్నేహితులు మధ్య ఆనందోత్సహాలతో జరుపుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

పల్లెల్లో ప్రతిరోజూ పండుగే..

తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



లెమన్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

సంక్రాంతి సంబరాల్లో మహిళలతో కలిసి స్పూన్‌లో లెమన్ ఆటలో తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. వివిధ పోటీలలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ బరిలో నిలిచి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. తాడులాగుడు పోటీలు వంటి పోటీలలో రెండు జట్లుగా ఏర్పడి అత్యంత ఆసక్తిగా సరదాగా డాక్టర్ లక్ష్మి పట్టు సాధించారు. ముగ్గుల పోటీ, స్పూన్ పోటీలలో డాక్టర్ లక్ష్మీ ముందుండి మహిళలను నడిపించడం ఉత్సాహాన్ని నింపింది. పిల్లలు కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వంలో పల్లెల్లో ప్రతిరోజు పండగే ఈ సంక్రాంతి అభివృద్ధి సంక్రాంతిగా మనం జరుపుకుంటున్నామని అన్నారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతిని దర్శి చందన సాంసంగ్ ఫ్రిజ్‌ను గెలుచుకోగా గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్‌లు అందించారు. రెండో ప్రైజు ఎల్ఇడి టీవీని మోరవాణి ప్రత్యూష, మూడో ప్రైజ్‌ను ఎల్ఇడి టీవీని పావని జానకి, నాలుగో ప్రైజు పేరం మనోజ్ఞ, ఐదో ప్రైజ్ పుష్ప అనూషలు గెలుపొందారు. లెమన్ అండ్ స్పూన్‌లో మొదటి ప్రైజ్ భాగ్యలక్ష్మి, రెండో ప్రైజ్ పల్లవి, మ్యూజికల్‌చైర్‌లో మొదటి బహుమతిని శిరీష, రెండో బహుమతిని దుర్గా భవాని గెలుచుకున్నారు. ముగ్గులు, లెమన్‌స్పూన్, తాడులాగుట, మ్యూజికల్‌చైర్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సిలేషన్లేషన్ బహుమతి అందించారు. కార్యక్రమంలో డిఎస్పీ లక్ష్మీ నారాయణ, సిఐ వై రామారావు, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, శేఖర్‌పంతులు, ఎంఇఓ బి రమాదేవి, శోభారాణి, నాగమణి పాల్గొన్నారు.



ఫ్రిజ్ అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్

జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వెలిగండ్ల

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని జెడ్పిటిసి, ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పిటిసిల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి ఒంగోలులో ఆయన స్వగృహంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకార అందించాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు.



బూచేపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న గుంటక



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వర్మ

పేదలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని చింతపూడికి చెందిన టిడిపి నాయకులు, వ్యాపారవేత్త గుంటిమడుగు శ్రీనివాస్‌వర్మ తన ఆర్థిక సాయంతో సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. చింతపూడు, నాగులవరం, కోమటిగుంట్ల గ్రామాలకు చెందిన 400 పేద కుటుంబాలకు 11 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. దాత శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే తన లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, రవీంద్రరాజు పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి-తాళ్ళూరు

గ్రామ స్థాయిలో వేస్ట్ ప్యాకింగ్ చేస్తున కార్మికులు ఆ వృత్తుల నుండి విముక్తి చెంది జీవనోపాదులను మెరుగుపర్చుకొనుటకు చిరువ్యాపారాలను ప్రోత్సహిస్తూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కార్యక్రమం అభినందనీయమని దారంవారి పాలెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ భీమిరెడ్డి రామిరెడ్డి అన్నారు. గ్రామంలో పాముల కాలనీలో వేస్ట్ ప్యాకింగ్ చేస్తున్న కుటుంబాలను గుర్తించి డిబిఆర్‌సి సంస్థ ఫ్యాన్సీ వ్యాపార వస్తువుల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకొనుటకు వేస్ట్ ప్యాకింగ్ చేస్తున్న నాగులూరి సుందరమ్మకు రూ.8 వేల విలువ చేసే ప్లాస్టిక్, ఫ్యాన్సీ వస్తువులు ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగులూరి స్వామియేలు, కోటయ్య, ఆబోతు కొండయ్య, గోపనబోయిన అంజమ్మ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చేస్తున్న దాతలు



డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గొట్టిపాటి లక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని మన్నేపల్లి సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గొంది రమణారెడ్డి (సమర) టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత సాగర్‌ను సోమవారం గొట్టిపాటి లక్ష్మి నివాసంలో ఘనంగా సన్మానించారు. తనను సహకార సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, పిన్నిక రమేష్, సూరిబాబు పాల్గొన్నారు.

పిసిపల్లిని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలి

ప్రజాశక్తి - పీసీపల్లి

వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చాలంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కలుషిత నీటితో వేలమంది కిడ్నీవ్యాధితో అల్లాడుతున్నారని తెలిపారు. మండలంలో 24 చెరువులు ఉన్నప్పటికీ ఒక్క చెరువు కూడా ప్రతిఏటా నిండే పరిస్థితి లేదు. శాశ్వత నీటి సౌకర్యం లేని మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని కోరుతూ రైతు సంఘం నాయకులు కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కరణం రత్తయ్య, కరణం నర్సయ్య మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టును పరిధిలో పిసిపల్లిని చేర్చకపోతే భవిష్యత్తులో ఎడారి అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తిచేసేందుకు ఫిబ్రవరిలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఏ ఒక్క చెరువుకు శాశ్వత నీటి వనరులు లేవని, కేవలం వర్షాలపై ఆధారపడటంతో వరి సాగు తగ్గిందని అన్నారు. నీళ్లలో విషపూరితమైన రసాయనాలు ఉన్నాయని, ఆ నీటిని త్రాగటం వలన ప్రతి గ్రామంలో కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. కిడ్నీ వ్యాధి గ్రస్తుల్లో పిసిపల్లి మండలం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. కానీ పాలకులు ఇవేమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారిన మండల వాసులు బ్రతుకులు మారలేదని ఆవేద వెలిబుచ్చారు. కావున ప్రభుత్వం స్పందించి వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చాలని, వెలిగొండ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తయ్యేందుకు ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

జగన్నాథంకు నివాళి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కో ఇన్‌చార్జి జెపి రాజు మాదిగ, మండల అధ్యక్షులు బలబద్ర శీను మాదిగ, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు నేదరుపల్లి బెంజిమెన మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు బలబద్ర రవిమాదిగ ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో హఠాత్ మరణం చెందిన మంద జగన్నాథం చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పి నాయకులు బలబద్ర రాంబాబుమాదిగ, గొల్లపల్లి ప్రభుదాస్, బలబద్దలు రమేష్, బలబద్ర ఇస్మాయిల్, పత్రా ప్రవీణ్, సూరి, పోగు ఏసు, ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి


ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జీవన శైలితో ముడిపడిన సంప్రదాయ పండుగ సంక్రాంతిని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు కోరారు. సోమవారం తెల్లవారుజామున టిడిపి జిల్లా కార్యాలయంలో సంక్రాంతి పండుగ మొదటి రోజు భోగి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి ఆయన భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ తెలుగు ప్రజలలో జరుపుకునే పండుగలలో సంక్రాంతి పండుగ అతి పెద్దదని తెలిపారు. ఈ పండుగ మానవ సంబంధాలను పెంపొందిస్తుందని, పాత ఆలోచనలు, దుఖాన్ని వదిలివేసి సరికొత్త ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకతితో మమేకమయ్యే ఈ సంప్రదాయ పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల సతీమణి దామచర్ల నాగ సత్యలత, కుమార్తెలు అనీషా లక్ష్మి, తనూజ లక్ష్మి, టిడిపి నాయకులు పెద్దిశెట్టి సూర్యప్రకాశ్ రెడ్డి, గోగినేని రామారావు, బోడపాటి వెంకట్, మహిళా నాయకురాళ్ళు కె.కుసుమ కుమారి, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, బీరం అరుణ, పసుపులేటి సునీత, గంగవరపు పద్మావతి, పెద్దిశెట్టి వరలక్ష్మి, నిడమానూరి పావని, కొక్కిలిగడ్డ లక్ష్మి, కె.శేషమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భోగి వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, కుటుంబ సభ్యులు

కొండపి: కొండపిలో భోగి, సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం మొదటి పండుగ భోగి పండుగను కొండపిలోని జెండా చెట్టు సెంటర్‌లో నిర్వహించారు. ఈ సంవత్సరం అందరూ భోగభోగ్యాలతో ఉండాలని, తెల్లవారు జాము నుంచి తాటిబోదలు, కర్రలు, కొయ్యలు రకరకాల వస్తువులను భోగి మంటల్లో వేశారు. యువత, చదువులకు సూదూర ప్రాంతాలకు వెళ్లినవారు సైతం తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులతో, కలిసి సంబరాలు చేసుకున్నారు.



చిన్నారులకు బోగిపళ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



ముగ్గులు వేస్తున్న మహిళలు

తోకలవానిపాలెంలో సంక్రాంతి సంబరాలు

కొల్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం భోగి రోజున తోకలవానిపాలెం గ్రామపంచాయతీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచి టి.కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ప్రజలు జూదాలు వైపు, కోడిపందాల వైపు చూడకుండా గ్రామంలోని ప్రజలందరూ ఒకే చోట చేరి సంక్రాంతి సంబరాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ఉండి ఒకే చోట చేరి సంక్రాంతి పండుగ జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల సిపిఎం పార్టీ కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య, ప్రజాసంఘాల నాయకులు బి.సుబ్బారావు, పి.మనోజ్, వాగోలు ఏసు, వాగోలు రమేష్, భాగ్యరాజు, కోటేశ్వరరావు, చిన్న సుబ్బారావు, కె.శ్రీనివాసరావు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పట్టణంలో బొమ్మలు కొలువు ఆకట్టుకుంటోంది. పట్టణంలోని కేశవ కూల్ డ్రింక్స్ యజమాని జి.లక్ష్మి స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా బొమ్మల కొలువును సంక్రాంతికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బొమ్మలు కొలువు ఏర్పాటు చేయడానికి 20 రోజుల సమయం పట్టిందన్నారు. బొమ్మల కొలువులో స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకులు, వివిధ రాష్ట్రాలకు సంబంధించి వస్త్రధారణతో కూడిన రకరకాల బొమ్మలతో పాటు శ్రీకృష్ణ గోకులం, గణేష్ ప్రీమియర్ లీగ్, ఉడెన్ హౌస్, బద్రీనాథ్, కైలాసం, తిరుమల కొండ, శ్రీరామ చరితం, రామ రావణ యుద్ధం, వైకుంఠ ద్వార దర్శనం, వంటి వివిధ రకాల బొమ్మలు ఏర్పాటు చేశామని తెలిపారు. బొమ్మల కొలువు బాపట్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆకర్షణగా నిలిచిన బొమ్మల కొలువు



వ్యవసాయ కార్మిక సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న కూలీలు

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొండపి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను పచ్చాకు కూలీలచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం 2005వ సంవత్సరంలో కమ్యూనిస్టులు పార్లమెంట్లో బిల్లు పెట్టి తీసుకురావడం జరిగిందన్నారు. రాజధాని ఢిల్లీ నుండి గల్లీ దాకా వ్యవసాయ కూలీ బిడ్డల ప్రధానమైనటువంటి సమస్యగా ఉన్న నిరుద్యోగ సమస్యను కొంతవరకు పరిష్కరించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ లాంటి పథకాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయటానికి అనేక కుట్రలు పన్నుతుందన్నారు. కష్టజీవుల పట్ల రైతుల పట్ల అంటరానివాళ్ళగా కేంద్ర ప్రభుత్వం చూస్తుంటే, చెయ్యి చెయ్యి కలిపి మరొక ఉద్యమాన్ని నడిపించి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, బన్నీ, అంజమ్మ, చాటగడ్డ సునంద, సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏల్చూరులో కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎస్ఐ

ప్రజాశక్తి-సంతమాగులూరు : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు. సోమవారం మండలంలోని ఏల్చూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రకాశం, గుంటూరు ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు ఆరు జట్లు కబడ్డీ పోటీలలో పాల్గొన్నాయి. ఈనెల 15వ తేదీ వరకు కబడ్డీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,116, రెండో బహుమతిగా రూ.20,116, మూడో బహుమతిగా రూ.10,116లను దాతలు చివరి తేదీన అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు డి.గాలెయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, తేలప్రోలు రమేష్, నక్కా వెంకటేశ్వర్లు, బండారు వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం దారా బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ పట్టాభి రామయ్య

జూదాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. కారంచేడు మండల పరిషత్ ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి, చీరాల డీఎస్పీ మహమ్మద్ మోయిన్ ఆదేశాల మేరకు కారంచేడు మండలంలో ప్రతిరోజు పోలీసు గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.



బండను లాగుతున్న ఎడ్లు

అట్టహాసంగా ఎడ్ల బల ప్రదర్శన

ప్రజాశక్తి-పర్చూరు

తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా పర్చూరు మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కీ.శే.గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించే 37వ జాతీయ స్థాయి ఎడ్ల బండలాగు పోటీలు ఈనెల 17వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. సోమవారం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ఎడ్ల జత 22 క్వింటాళ్ళ బండను 4226 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి.

శింగరకొండలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ తదుపరి వేదపండితులు, అర్చకులు, ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు యశోద దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం రాత్రి శింగరాయకొండ ఏఆర్‌సి అండ్ జివిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో బి.శ్రీనివాస్, ఎన్ఎల్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, బి శ్రీను, సయ్యద్ జిలానిబాషా, పి వెంకట్రావు, హనుమంతరావు, పెరుగు శీను తదితరులు పాల్గొన్నారు.



భోగి వేడుకల్లో మంత్రి స్వామి

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన నివాసంలో భోగి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ, దేశ, విదేశాలలో ఉన్న తెలుగు వారికి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు, కాంట్రాక్టర్లు, పోలీసు సిబ్బందికి బకాయిలు రూ.6,700 కోట్లు విడుదల చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు.



భోగి మంట వేస్తున్న ఎస్పీ దామోదర్

సంక్రాంతి కొత్త కాంతులు నింపాలి

ఎస్‌పి ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జీవన శైలితో ముడిపడిన సంప్రదాయ పండుగ సంక్రాంతిని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎస్‌పి ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. సోమవారం తెల్లవారుజామున జిల్లా పోలీస్ కార్యాలయంలో సంక్రాంతి పండుగలో మొదటి రోజు భోగి సందర్భంగా జిల్లా ఎస్‌పి కుటుంబ సమేతంగా సంప్రదాయ బద్ధంగా భోగి మంటలు వేశారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రకృతితో మమేకమయ్యే ఈ సంప్రదాయ పండుగను ప్రతి ఒక్కరు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బందికి, ప్రజలకు, మీడియా మిత్రులకు సంక్రాతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉప్పుగుండూరులో పొట్టేళ్ల బలప్రదర్శన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఉప్పుగుండూరులో కాకతీయ సేవాసమితి ఆద్వర్యంలో సోమవారం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో నిర్వహించిన పొట్టేళ్ల బలప్రదర్శన ఉత్సాహంగా సాగింది. మొత్తం 32 పొట్టేళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిని బాపట్ల జిల్లా పర్చూరు మండలానికి చెందిన పోలేరమ్మ తల్లి పొట్టేలు దక్కించుకుంది. రెండో బహుమతిగా ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరుకు చెందిన మద్దిసాని సుబ్బారావు పొట్టేలుకు దక్కింది. మూడో బహుమతి బాపట్ల జిల్లా, పంగులూరు మండలం రేణంగివరానికి చెందిన యద్దనపూడి వెంకటేశ్వర్లు పొట్టేలు దక్కించుకుంది. నాలుగో బహుమతి బాపట్ల జిల్లా, చిన్నగంజాంకు చెందిన దీరా పొట్టేల్ గెలుచుకుంది.



బలప్రదర్శనలో పాల్గొన పొట్టేళ్లు

శ్రీవారి పుష్కరిణిలో వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని కె.అగ్రహారం ప్రసన్న వెంకటేశ్వరస్వామి (చిన్న తిరుమల) దేవస్థానం పరిధిలోని శ్రీవారి పుష్కరిణిలో సోమవారం సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. దేవస్థానం పరిధిలో భారీ విద్యుత్తు అలంకరణలతో నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీమకుర్తి సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాలలో ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ నిర్వాహకులు, కష్ణసాయి గ్రానైట్స్ అధినేతలు శిద్దా హైమావతి, శిద్దా వెంకటేశ్వరరావు దంపతులు, శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా సూర్య ప్రకాష్‌రావు దంపతులు, శిద్దా భరత్ ప్రవల్లిక దంపతులు, ఉదయ్ దంపతులు, కోట బాలకష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం

వైసిపి ఒంగోలు అసెంబ్లీ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో పార్టీ ప్రచారం చేసుకున్నారని, రెవెన్యూ యంత్రాంగాన్ని వాడుకోవటమే తప్ప రెవెన్యూ సమస్యలు పరిష్కరించిన పాపాన పోలేదని వైసిపి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు విమర్శించారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రభుత్వ విధానాలపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ గతంలో ఈనాం భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కారం కాక ప్రజల ఇబ్బంది పడ్డారని, వైసిపి ప్రభుత్వ హయాంలో వాటికి చక్కటి పరిష్కారం చూపించారన్నారు. వైసిపి ప్రభుత్వంలో డికె పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారని, చుక్కల భూములు, 22ఏ సమస్యలకు పరిష్కారం చూపారని గుర్తు చేశారు. భూముల రీ సర్వే లాంటి పెద్ద కార్యక్రమం చేపడితే అప్పటి ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వాటిపై దుష్ప్రచారం చేసి వాటిని అడ్డుకున్నారన్నారు.



మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను వంచించారని, సంక్రాంతి పండుగ కూటమి ప్రభుత్వ పెద్దలకే వచ్చింది తప్ప ప్రజలకు కాదన్నారు. అర్జీలు తీసుకుంటున్నారే గానీ వాటిని పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ఏడు నెలల కూటమి ప్రభుత్వ పరిపాలన మొత్తం వైఫల్యాలు తప్ప అభివద్ధి మాత్రం శూన్యమని విమర్శించారు. రెండు, మూడు సంవత్సరాల్లోనే కూటమి ప్రభుత్వం పూర్తిగా ప్రజలలో చులకనయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొమ్మూరి కనకారావు మాదిగ, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నగర కంటి శ్రీనివాసరావు నగర కన్వీనర్ రాంబాబు, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, మీరావలి పాల్గొన్నారు.



అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న కొండవీటి జ్యోతిర్మయి

వీనులవిందుగా అన్నమాచార్య సంకీర్తనలు

పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గోవింద నామస్మరణతో ఒంగోలు మినీ స్టేడియం మారుమోగిపోయింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆయన, సతీమణి దామచర్ల నాగసత్యలత ఆధ్వర్యంలో ఒంగోలు మినీ స్టేడియం ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనలు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా మినీ స్టేడియాన్ని ముస్తాబు చేశారు. తొలుత నళిని ప్రియ నృత్య అకాడమీ విద్యార్థులు 'శ్రీనివాస కళ్యాణం ' నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు సమన్వయకర్తగా వ్యవహరించారు. అన్నమాచార్య సంకీర్తనలు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తిరుమల లడ్డూ ప్రసాదం అందజేశారు. అన్నమాచార్య సంకీర్తనలు కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, గిద్దలూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, జనసేన పార్టీ జిల్లాఅధ్యక్షులు షేక్ రియాజ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, దామచర్ల కుమార్తెలు అనీషా లక్ష్మి, తనూజ లక్ష్మి, కుటుంబ సభ్యులు, ఒంగోలునగర ప్రముఖులు పాల్గొన్నారు.



గాలిపటాలు ఎగరేస్తున్న చిన్నారులు

ఘనంగా కైట్ ఫెస్టివల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగర పరిధిలోని పేర్నమిట్టలో వున్న హిల్‌సిటీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్ అందరినీ ఆకట్టుకుంది. యువతీ యువకులు, చిన్నారులు వివిధ రూపాలలో వున్న పతంగులను ఎగురవేస్తూ పోటీ పడ్డారు. అనంతరం మహా సహస్ర అవధాని పద్మశ్రీ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగాలు అలరించాయి. కార్యక్రమంలో హిల్‌సిటీ ఎండీ ప్రత్తిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.